సాక్షి తిరుపతి

బుధవారం । 4 । జూన్ । 2025



చదును చేసి.. చెరువు కబ్జా!

కలువాయి మండలం మాదన్నగారిపల్లెలో చెరువు పోరంబోకు భూమిని టీడీపీ స్థానిక నేత ఆక్రమించాడు. - 8లో



అభివృద్ధి లేదు.. అంతా అరాచకమే!

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ఊసే లేదని, అంతా అరాచకమే సాగుతోందని భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. - 8లో



భక్తుల భద్రతకు భరోసా

శ్రీవారి భక్తుల భద్రతే లక్ష్యంగా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. విష్ణునివాసం, శ్రీనివాసం వద్ద నిఘా పెట్టారు. - 8లో

న్యూస్‌రీల్

సంజయ్‌మూర్తికి సాదర వీడ్కోలు



శ్రీవారి ప్రతిమను అందిస్తున్న కలెక్టర్

రేణిగుంట : జిల్లా పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన కంప్ట్రోలర్, ఆడిట్ జనరల్ సంజయ్‌మూర్తికి మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్ సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్రీవారి ప్రతిమను బహూకరించారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లాసెట్ ప్రవేశ పరీక్ష గురువారం జరగనుంది. ఈ మేరకు ఇప్పటికే హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. తిరుపతి కేంద్రంగా జరగనున్న ఎస్వీసీఈ, శ్రీరామ, అన్నమాచార్య, చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు లాసెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లతో పాటు ఐడీ ప్రూఫ్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. పరీక్ష 9 గంటల నుంచి 10.30 వరకు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు.

8న చెస్ టోర్నమెంట్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 8వ తేదీన చెస్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, చెస్ సంఘం సీఈఓ బాలాజీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు టోర్నీ బ్రోచర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు చెస్ పోటీలు జరుగుతాయన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ఆసక్తిగల క్రీడాకారులందరూ టోర్నీలో పాల్గొనవచ్చని వెల్లడించారు. విజేతలకు ఆకర్షణీయమైన ట్రోఫీలు అందించనున్నట్లు చెప్పారు. పాల్గొన్న క్రీడాకారులందరికీ మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. మధ్యాహ్న భోజన వసతి ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు ఎంట్రీ ఫీజు కింద రూ.200లు చెల్లించాలని సూచించారు. ఈ మేరకు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8555921134,8985080370 నంబర్లలో సంప్రదించాలని వెల్లడించారు.కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు ఎస్.రెడ్డెప్ప, నడ్డినారాయణ, పంచముఖేశ్వరరావు, ఎస్.మునిరాజ, గురునాథం, తహసున్నీసా, రెడ్డెప్ప, ఇమామ్, లక్ష్మీనారాయణ, జ్ఞానప్రసూన పాల్గొన్నారు.

అవినీతికి ఆయనే ఆదర్శం.. మోసానికి మరోరూపం.. కుట్రలు.. కుతంత్రాలే ఆయన నైజం.. నయవంచనకు నిలువెత్తు నిదర్శనం.. వెన్నుపోటు అంటే ఆయనకే పేటెంటు.. సదరు ఘనత వహించిన బాబుగారు ఏళ్ల తరబడి ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఏనాడూ ఇచ్చిన మాట చెల్లించరు.. ఓట్ల కోసం అలవి కాని హామీలను సైతం సునాయాసంగా గుప్పించేస్తారు. ఆకాశం నేల మీదకు దించేస్తానంటారు.. సంపదను సృష్టించి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేస్తానంటారు.. ఎలాగైనా పీఠం ఎక్కడమే పరమావధిగా భావిస్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోను బుట్టదాఖలు చేసేస్తారు.. ఇదే తంతును చంద్రబాబు మరోసారి కొనసాగిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఆశువుగా వల్లించిన సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను బురిడీ కొట్టించారు. సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటంగా తీసుకువచ్చిన మేనిఫెస్టోను మూలన పడేశారు. అభివృద్ధి సంగతి దేముడెరుగు.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు.. రోజుకో మాట చెబుతూ జనాలకు కుచ్చుటోపీ పెట్టేశారు. తత్వం బోధపడదంతో క్షేత్రస్థాయిలో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. బాబు మాటలు నమ్మి మోసపోయామంటూ మథనపడుతున్నారు. కూటమి సర్కారు తీరుకు నిరసనగా బుధవారం వెన్నుపోటు దినం పాటించాలని నిర్ణయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు పోటెత్తాలని పిలుపునిస్తున్నారు.



వంచనకు వసంతం!

ప్రజలను మరోసారి బురిడీ కొట్టించిన బాబు

- ఏడాదిగా అమలు కాని హామీలు
- మేనిఫెస్టో మళ్లీ బుట్టదాఖలు
- దాడులు.. అక్రమ కేసులు.. అరెస్ట్‌లకే పాలన పరిమితం
- సంపద సృష్టి పేరుతో సంక్షేమ పథకాలకు తూట్లు
- చంద్రబాబు వైఫల్యాలపై నేడు కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన
- వెన్నుపోటు దినంగా పాటిస్తూ ఆందోళన

చెప్పింది ఇదీ..	ఏడాదిగా చేసింది ఇదీ..
సూపర్ సిక్స్ పథకాలను అందిస్తాం	బూటకపు హామీలుగానే మిగిలిపోయాయి
ఏటా 4లక్షల ఉద్యోగాలు.. 5ఏళ్లలో 20లక్షలు	ఇచ్చింది శూన్యం
ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్	ప్రస్తావనే లేదు
ప్రతి నిరుద్యోగికీ భృతి నెలకు రూ.3వేలు	పట్టించుకోలేదు
తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15వేలు	ఊరిస్తూనే వస్తున్నారు
అన్నదాత సుఖీభవ కింద రైతుకు ఆర్థిక సాయం రూ.20వేలు	ఊసే లేదు
18ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500	నోరు మెదపడం లేదు
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం	ప్రస్తావనే ఎత్తలేదు
వలంటీర్లకు గౌరవవేతనం నెలకు రూ.10వేలు	వ్యవస్థనే తొలగించేశారు
50ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్	12వేల మందికి తీసేశారు
అర్చకులకు నెలకు రూ.15వేలు	శఠగోపం పెట్టేశారు
ఉచిత ఇసుక	ధరలు పెంచి దోచుకుంటున్నారు
కరెంట్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు	సామాన్యుడు కట్టలేని స్థాయికి పెంచారు
సత్యవేడులో ఆర్డీఓ కార్యాలయం	అవునా...మేం చెప్పామా...!
సత్యవేడులో వంద పడకల ఆస్పత్రి	నానుస్తూనే ఉన్నారు
తిరుమల పవిత్రతను కాపాడుతాం	అపచారాలు నిత్యకృత్యం
పోటు వృత్తిని కుల వృత్తిగా పరిగణిస్తాం	పట్టించుకున్న పాపాన పోలేదు
ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యం	జిల్లాలో 10వేల మంది ఉద్యోగుల తొలగింపు

జిల్లాలో ఏడాదిగా పథకాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు	
తిరుపతి	1,89,569
చంద్రగిరి	2,17,678
శ్రీకాళహస్తి	1,75,095
వెంకటగిరి	1,82,767
సూళ్లూరుపేట	1,67,990
గూడూరు	1,51,874
సత్యవేడు	1,39,087

సంక్షేమం కింద ప్రజలకు అందాల్సిన మొత్తం	
పథకం	లబ్ధిదారుల చేరాల్సిన నగదు
తల్లికి వందనం	రూ.870 కోట్లు
ఆడబిడ్డ నిధి	రూ.2,359.15కోట్లు
ఉచిత బస్సు	రూ.2,123 కోట్లు
అన్నదాత సుఖీభవ	రూ.4,598 కోట్లు
నిరుద్యోగ భృతి	రూ.984.23 కోట్లు

తిరుపతి సిటీ : సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టడమే లక్ష్యంగా చంద్రబాబు అండ్ కో మోసపూరిత హామీలను గుప్పించారు. సూపర్ సిక్స్ అంటూ బూటకపు మేనిఫెస్టోను ప్రకటించారు. ఊరు వాడా తిరుగుతూ ప్రజలను నమ్మించారు. అమలు చేయలేమని తెలిసీ ఇష్టారాజ్యంగా 143 హామీలను మేనిఫెస్టోను తీసుకువచ్చారు. అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి ఆర్థిక స్థితి బాగోలేదంటూ మేనిఫెస్టోను మూలన పడేశారు. అభివృద్ధిని అటకెక్కించి సంక్షేమ పథకాలను గాలికొదిలేశారు. ప్రధానంగా మహిళా శక్తి పేరుతో ఆడపడుచులకు ఇచ్చిన హామీలు తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు వంటి పథకాలను పక్కనపెట్టేశారు. నీకు 15వేలు..నీకు 15వేలు..మరి నీకు 18వేలంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు నేడు చేతులెత్తేశారు. దీపం–2 అంటూ.. ఉచిత గ్యాస్ అంటూ జనం చెవిలో పువ్వులు పెట్టేశారు. తూతూమంత్రంగా పథకం అమలు చేస్తున్నారు. పథకం జిల్లాలో కనీసం 30శాతం మందికి కూడా ఉచిత సిలిండర్ అందించిన దాఖలాలు లేవు. కుల వృత్తులు, వైద్య, విద్యా రంగాల పరిస్థితి మరింత దయనీయ స్థితికి చేర్చేశారు.

వెటకారపు మాటలు

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు ప్రజలను హేళన చేస్తూ వెటకారంగా మాట్లాడడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో హామీలను గుప్పించారు. ఇప్పుడు సంక్షేమ పథకాల అమలు చేయాలంటే డబ్బులు లేవు.. సంపద సృష్టించి తర్వాత అందిస్తాం...అలా సంపద సృష్టించే ఐడియాలు ఏమైనా ఉంటే తనకు చెవిలో చెప్పాలంటూ అవహేళనగా నిండు సభలో చంద్రబాబు మాట్లాడడంతో సూపర్‌సిక్స్ పథకాల అమలు అసాధ్యమని తేలిపోయింది. దీంతో బడుగు బలహీన వర్గాలు, పేదలను సైతం బాబు వెన్నుపోటు పొడిచేందుకు వెనుకాడడని ఆయన నైజం మరోసారి బయటపడిందంటూ జిల్లావాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. తన అనుచరులను, పార్టీ కార్యకర్తలను యథేచ్ఛగా దోచుకోండి.. దాచుకోండి అంటూ ప్రోత్సహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దాడులు.. దౌర్జన్యాలు

కూటమి ప్రభుత్వ పాలన ఏడాది గడుస్తున్నా జిల్లా ప్రజలకు చిల్లిగవ్వ చేతికందలేదు. బాబు పాలన నవ్విపోదురుగాక నాకేంటి.. అన్నట్టు కొనసాగుతోంది. దాడులు, దౌర్జన్యాలు, కేసులు, అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. భూకబ్జాలు పెరిగిపోయాయి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు కూటమి నేతలు వాలిపోతున్నారు. అధికారులు, సామాన్య ప్రజలను బెదిరించి రాత్రికి రాత్రే జేసీబీలతో చదును చేసుకుని స్వాహా చేస్తున్నారు. ఉచిత ఇసుక అంటూ ఊదరగొట్టి పచ్చమూకకు ప్రకృతి వనరులను అప్పగించేశారు. సీసీ రోడ్లు, భవనాలు, పంచాయతీ పనులు, ఆర్ అండ్‌బీ, గనుల కాంట్రాక్టు వంటి పనులను తెలుగుతమ్ముళ్లకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టేశారు. ప్రశ్నించి వారిపై దాడులకు పాల్పడటం, విచక్షణారహితంగా గాయపరుస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయవద్దని పోలీసులను సైతం శాసిస్తున్నారు.

పశ్నించే గళం ఏమైంది?



ప్రభుత్వాలు తప్పు చేసినా, సామాన్య ప్రజలకు అన్యాయం జరిగినా స్పందించి ప్రశ్నిస్తాననే పవన్ కల్యాణ్ గళం ఏమైంది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతోంది. కనీసం ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదో ప్రశ్నించాలి. గత ప్రభుత్వంలో ప్రతి మహిళకు ఏడాదిలోనే జగనన్న లక్షల రూపాయల లబ్ధి చేకూర్చారు. ప్రస్తుతం గ్రామీణ మహిళలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. పట్టించుకునే నాథుడు లేడు. ఆడబిడ్డ నిధి, తల్లికివందనం, ఉచిత బస్సు ఊసే ఎత్తడం లేదు. – బి.ధనమ్మ, యలమంద, చంద్రగిరి

మాయమాటలు చెప్పారు



ప్రజలను వంచించి ఓట్లు వేయించుకున్నారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఆడబిడ్డ నిధిపై నోరు మెదపడం లేదు. మహానాడు వేదికగా పథకాల అమలుపై స్పష్టత ఇస్తారనుకున్నాం. ఆ ప్రస్తావనే లేదు. నీకు 15...నీకు...15...నీకు 18 అంటూ ప్రగల్భాలు పలికి మహిళలకు మాయమాటలు చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. ఉన్న పింఛన్‌లను తొలగించారు. నామమాత్రంగా దీపం పథకం పేరుతో కొందరికే నగదు జమచేశారు. బాబు పాలన దారుణంగా ఉంది.– ఓ.అంకమ్మ, సైదాపురం, వెంకటగిరి

అస్తవ్యస్తంగా ఉంది



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచింది. పాలన అస్తవ్యస్తంగా ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదు. సంక్షేమం, అభివృద్ధి రెండు స్తంభించిపోయాయి. కనీసం పేద, బడుగు బలహీన వర్గాలకు ఒక్క పథకం కూడా అందలేదు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఆర్భాటంగా సూపర్‌సిక్స్‌తో సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తామన్నారు. ఏడాది గడిచింది ఒక రూపాయి రాలేదు. గతంలో ఇలాంటి ప్రభుత్వాన్ని చూడలేదు – మోహన్, మాజీ సర్పంచ్, కురింజలం, వరదయ్యపాళెం

ఒక్క పథకం అందలేదు



గత ప్రభుత్వమే ఎంతో మేలుగా ఉంది. కూటమి సర్కార్ మా లాంటి పేదలకు ఏమి చేయలేదు. సంవత్సరం అయిపోయింది. ఇంక ఏం చేస్తారో నమ్మకం లేదు. గతంలో జగనన్న ఏడాదిలో ప్రతి నెలా ఏదో ఒక పథకంతో బ్యాంకు ఖాతాలో డబ్బు జమచేశారు. సొంత ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వ ఉండడం లేదు. రెక్కల కష్టమే మిగులుతోంది. పిల్లల చదువులు కష్టంగా మారాయి. ఎన్నికల సమయంలో తల్లికి వందనం, కుటుంబంలో ఉన్న మహిళల అందరికి నెలకు రూ.1500 అన్నారు. ఇప్పటి వరకు ఏమీ ఇవ్వలేదు.

– వెంకటరత్నమ్మ, అడుసుపాళెం, రేణిగుంట

ఉద్యోగాలు లేవు



యువగళం పాదయాత్రలో లోకేష్ బాబు యువతతో మీటింగ్ పెట్టి ఏడాదికి 4లక్షల ఉద్యోగాలు ఇస్తాం. 5ఏళ్లలో 20లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను ఆదుకుంటాం అంటూ ఊదరగొట్టారు. ఇప్పటికీ ఆ ఊసేలేదు. ఉద్యోగం వచ్చేవరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేల భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. అదీ అమలు చేయలేదు. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టి రోడ్డుపాలు చేస్తున్నారు. మెగా డిఎస్సీపై తొలి సంతకం చేసిన ఏడాదికి తూతూ మంత్రంగా భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. – రామకృష్ణ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, తిరుపతి రూరల్

దారుణంగా ఉంది



ఏడాదిగా ఒక్క రూపాయి పేదలకు అందలేదు. ఎన్నికలలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ మహిళలకు చేరలేదు. గ్రామీణ ప్రాంతంలోని మాలాంటి పేదల పరిస్థితి దారుణంగా ఉంది. జగనన్న పాలనలో ఆసరా పథకం, సున్నావడ్డీ, అమ్మ ఒడితో ఎంతో మంది ఆర్థికంగా బలపడ్డారు. ఈ ఏడాది నుంచి పథకాలు రాక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా తల్లికివందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు పథకాలను అమలు చేసి ఆదుకోవాలి.

– టి.రేణుక, గృహిణి, సూళ్లూరుపేట

కూటమి ప్రభుత్వం.. చేసింది శూన్యం



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి, పక్కన ఎంపీ గురుమూర్తి, మేడా రఘునాథరెడ్డి, అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తి, తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై బుధవారం వెన్నుపోటు దినం పాటిస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఏడాది పాలనలో 800 మందికి పైగా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన జూన్ 4వ తేదీని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు దినంగా నామకరణం చేశారని, ఆ మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల నిరసనలు తెలిపి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సత్యనారాయణపురం నుంచి ర్యాలీ

తిరుపతి జీవకోన మార్గంలోని సత్యనారాయణపురం సర్కిల్ నుంచి బుధవారం ఉదయం 9గంటలకు భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. సత్యనారాయణపురం నుంచి తిరుమల బైపాస్‌రోడ్డులోని మున్సిపల్ పార్క్ వరకు నిరసన ర్యాలీ కొనసాగుతుందని వెల్లడించారు. అనంతరం తిరుపతి ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించనున్నట్లు వివరించారు.

మైనర్ల బైక్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

తిరుపతి క్రైమ్: నగరంలో ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్లపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమయ్య సర్కిల్, టౌన్ క్లబ్, నంది సర్కిల్‌తో పాటు నాలుగు కాళ్ల మండపం వద్ద మైనర్లను గుర్తించేందుకు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ పార్టీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. 17 మంది బాలురను గుర్తించి ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. వారి కుటుంబ సభ్యులను పిలిపించి పిల్లల సమక్షంలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంకోసారి పిల్లలకు వాహనాలు ఇస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొదటి తప్పుగా భావించి జరిమానాలతో సరి పెట్టామన్నారు. పునరావృతమైతే తల్లిదండ్రులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వరుస భేటీలు.. విషయం ఏంటో?



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

తిరుపతి అర్బన్ : నియోజకవర్గ అభివృద్ధి కోసం.. ప్రజా సమస్యలు పరిష్కారం కోసమంటూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తమ నియోజకవర్గ అభివృద్ధి కోసం నోరెత్తిన దాఖలాలు లేవు. కానీ...కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మాత్రం పదేపదే కలుస్తున్నాన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై కలెక్టర్‌ను కలిసినట్లు సమాచారశాఖ ద్వారా ఓ ప్రకటన విడుదల చేయిస్తున్నారు. సొంత సమస్యలో...లేదా ప్రజా సమస్యలో తెలియడం లేదు...మొత్తానికి కలెక్టర్‌ను మాత్రం తరచూ కలుస్తున్నారంటూ జిల్లాలోని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే సమాచారశాఖ వారు విడుదల చేస్తున్న ప్రకటనలోనే ఏ సమస్యపై కలెక్టర్‌తో చర్చించారో...ఆ సమస్య ఎంత మేర పరిష్కరించారో తెలియజేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

వెన్నుపోటు దినం..

ఊరూరా ఉద్యమం

- ప్రభుత్వ మోసాలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన
- నేడు జిల్లావ్యాప్తంగా ఆందోళనకు సన్నద్ధమైన శ్రేణులు



తిరుపతి అర్బన్ : కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోంది. అయితే ఇప్పటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. ప్రభుత్వం వైఖరిపై ప్రజలు మండిపడుతున్నారు. వైఎస్సార్‌సీపీతో కలసి బుధవారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

గూడూరు : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ నేతృత్వంలో పట్టణంలోని టౌన్‌క్లాక్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. సర్కార్ తీరును ఎండగడుతూ నిరసన చేపట్టనున్నారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలు,కార్యకర్తలతో పాటు స్వచ్ఛందంగా ప్రజలు హాజరుకానున్నారు.

వెంకటగిరి : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో రాపూరులోని పడమటి వీధి సిద్దులయ్య ఆలయం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లనున్నారు. అనంతరం నిరసన చేపట్టనున్నారు.

సత్యవేడు : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు చేసిన మోసాలను వివరించనున్నారు.

సూళ్లూరుపేట : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య నేతృత్వంలో నాయుడుపేటలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం నిరసన వ్యక్తం చేయనున్నారు.

చంద్రగిరి : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్‌క్లాక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టనున్నారు. స్థానికంగా జరుగుతున్న అరాచకాలతోపాటు కూటమి సర్కార్ ఇచ్చిన హామీల నెరవేర్చకపోవడంపై నిరసన వ్యక్తం చేయనున్నారు.

తిరుపతి: తిరుపతి నగరంలోని జీవకోన నుంచి లీలామహల్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీషా ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించనున్నారు.

శ్రీకాళహస్తి : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బియ్యపు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో పట్టణంలోని శ్రీరామనగర్‌కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకోనున్నారు. అనంతరం కూటమి సర్కార్‌లో దోపిడీ విధానం, కక్ష సాధింపు చర్యలు, అమలు చేయని హామీలపై నిరసన చేపట్టనున్నారు.

‘వెన్నుపోటు’ ప్లకార్డుల ఆవిష్కరణ



ప్లకార్డును ఆవిష్కరిస్తున్న భూమన

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన ప్లకార్డులను వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలో నివాసంలో ఆయన మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా నిరసన వ్యక్తం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట : స్థానిక వేణు గోపాలపురం సమాధుల వద్ద ముళ్ల పొదల్లో గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోలీసులు తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి 55 ఏళ్ల నుంచి 60 ఏళ్ల ఉంటాయని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చదును చేసి.. చెరువు కబ్జా!


చెరువును అక్రమించి చదును చేసిన దృశ్యం

కలువాయి(సైదాపురం):మండలంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక, మట్టి తవ్వకాలతోపాటు చెరువుల ఆక్రమణ పెరిగిపోయింది. ఈ క్రమంలోనే కలువాయి మండలం బ మాదన్నగారిపల్లెలో సర్వే నంబర్ 56లో ఉన్న 3 ఎకరాల చెరువు పోరంబోకు భూమిని ఓ టీడీపీ నేత కబ్జా చేసేశాడు. యథేచ్ఛగా చదును చేసుకుని ఆరుతడి పంటల సాగుకు రంగం సిద్ధం చేసేసుకున్నాడు. కలువాయి చెరువుకు అంతర్భాగమైన ఈ భూమిని పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

పీజీసెట్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్న ఏపీ పీజీసెట్-2025 షెడ్యూల్‌లో అధికారులు స్వల్ప మార్పు చేసినట్లు తెలిసింది. 9వ తేదీన నిర్వహించాల్సిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రన్స్ పరీక్షను డీఎస్సీ షెడ్యూల్ నేపథ్యంలో 10వ తేదీకి వాయిదా వేసినట్లు సమాచారం. డీఎస్సీకి హాజరుకానున్న విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ మార్పు చేసినట్లు తెలుస్తోంది.

ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.54 లక్షల విరాళం


అదనపు ఈఓకు డీడీ అందిస్తున్న దాత

తిరుమల : టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు కర్ణాటకులోని మంగుళూరుకు చెందిన విదా రవిచంద్రన్ అనే భక్తురాలు రూ.54 లక్షలను విరాళంగా అందించారు. మంగళవారం ఈ మేరకు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి డీడీని అందజేశారు.

అల్లిమడుగు కొండపై గుర్తు తెలియని మృతదేహం

శ్రీకాళహస్తి: పట్టణంలోని తుపాను సెంటర్ పక్కన అల్లిమడుగు కొండపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

అభివృద్ధి లేదు.. అంతా అరాచకమే!


చంద్రగిరిలో సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు


మాట్లాడుతున్న భూమన, వేదికపై మోహిత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్ :"రాష్ట్రంలో అభివృద్ధి ఊసే లేదు.. అంతా అరాచకమే నడుస్తోంది. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్.. సెవెన్ అంటూ చంద్రబాబు హామీలు గుప్పించారు. అధికారం కోసం నోటికి వచ్చిన అబద్ధాలన్నీ చెప్పేశారు. ఇప్పుడు గల్లా పెట్టెలో డబ్బులు లేవు అంటూ చేతులెత్తేశారు. పదవి కోసం ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. అందుకే బుధవారం జిల్లావ్యాప్తంగా వెన్నుపోటు దినం పేరుతో నిరసన వ్యక్తం చేయనున్నాం'' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం చంద్రగిరిలోని వైఎస్ఎంఆర్ కల్యాణ మండపంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా భూమనతోపాటు చిత్తూరు పార్లమెంట్ సెగ్మెంట్ పరిశీలకుడు చావా రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. భూమన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలు మేరకు బుధవారం చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో టీడీపీ ఓడిపోయినప్పుడు ఆ పార్టీ కార్యకర్తలు బయటకు రావడానికి 3 ఏళ్లు పట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధికారం పోయిన రెండు నెలలకే రోడ్డుపైకి వచ్చారని వెల్లడించారు. ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని కూలదోసేంత వరకు పోరాటం చేయాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం చంద్రగిరి నుంచే ప్రారంభమైనట్టుందన్నారు. కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతోందని మండిపడ్డారు.

మాఫియా పాలన నడుస్తోంది

కూటమి ప్రభుత్వంలో మాఫియా పాలన నడుస్తోందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆరోపించారు. నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా ఇస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ మాట ఇచ్చారన్నారు. ఎంత మందికి ఇచ్చారు..? ఎక్కడ ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సుపై ఒక్కొక్కసారి ఒక్కో మంత్రి మీడియా ముందుకు వచ్చి ఉగాది నుంచి ఇస్తాం.. దీపావళికి అమలు చేస్తాం.. సంక్రాంతి నుంచి అమలు చేస్తాం అని ఉత్తుత్తి మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. చంద్రగిరి ఎమ్మెల్యే నాని ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని స్పష్టం చేశారు. మట్టి, ఇసుక అక్రమ రవాణా, భూ కబ్జాలు, లిక్కర్ మాఫియాను పెంచి పోషిస్తున్నారని విమర్శించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 84,418 మంది స్వామివారిని దర్శించుకోగా 34,900 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతుండగా టిక్కెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

రాజీనామా చేయాలని వీఓఏపై ఒత్తిడి

కలువాయి (సైదాపురం) : కలువాయి మండలం పెరమకొండ వెలుగు వీఓఏ (విలేజీ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) సుంకు రజనీని రాజీనామా చేయాలని కూటమి నేతలు ఒత్తిడి చేస్తున్నారు. ఆ స్థానంలో తమ అనుచరుల్లో ఒకరిని నియమించుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. చివరకు సీఈ, ఏపీఎం సైతం ఎప్పుడు రాజీనామా చేస్తున్నావని అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే మండలంలోని మాదన్నగారిపల్లి, దాచూరు వీఓఏలు కూడా హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నా, అధికారులు మాత్రం వారిని కూడా విధులకు హాజరుకానివ్వడం లేదని తెలుస్తోంది.

శ్రీహరి బస్టాండ్ కూల్చివేతకు సన్నాహాలు

- 15 నుంచి పనులు మొదలు?


బస్టాండ్‌లో తొలగించనున్న ప్రాంతం

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలోని శ్రీహరి బస్టాండ్‌లో మొదటి ఐదు ప్లాట్‌ఫామ్‌లను కూల్చేందుకు టెండర్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. చిత్తూరుకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు టెండర్ దక్కింది. కూల్చివేతకు రూ.13లక్షలు కేటాయించారు. తిరిగి అదే స్థలంలో రేకులతో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడానికి రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఆ టెండర్‌ను ఈ నెలాఖరులో ఖరారు చేయనున్నారు. ప్రధానంగా కూల్చడానికి నిర్ణయించిన ప్రాంతంలో ఐదు ప్లాట్‌ఫామ్‌లతోపాటు 4 దుకాణాలు, ఓ మరుగుదొడ్డి సెంటర్, కార్గో సెంటర్, రిజర్వేషన్ కార్యాలయం, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం)కార్యాలయం ఉన్నాయి. వీటిని ఏ ప్రాంతంలోకి మార్చాలనే అంశంపై ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలన చేపట్టారు. అదే ప్రాంతంలోని ఏడుకొండల బస్టాండ్ పక్కనే టీటీడీ వారు దర్శన టిక్కెట్ల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఆ కౌంటర్‌ను ఆర్టీసీ కార్గోకు వినియోగించాలని ప్రయత్నిస్తున్నారు. మరోవైపు రిజర్వేషన్ కౌంటర్‌ను శ్రీనివాస బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న రెండు దుకాణాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఏటీఎం కార్యాలయం సైతం శ్రీనివాస బస్టాండ్‌లోని ఓ దుకాణంలోకి మార్పు చేయాలని చూస్తున్నారు. అలాగే ప్రయాణికులకు కల్పించాల్సిన వసతులపై నివేదిక రూపొందించేందుకు ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఎం బాలాజీ, ఏఓ షెషబాన్, ఏటీఎం డీఆర్ నాయుడుతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నెల 10న నివేదికను డీపీటీఓ వెంకట్రామ్‌కు అందించనున్నారు. అనంతరం ఈ నెల 15 నుంచి శ్రీహరి బస్టాండ్ కూల్చివేత పనులు చేపట్టనున్నారు.

బాలుడు అదృశ్యంపై కేసు


ఆదిత్య (ఫైల్)

రేణిగుంట : ఇంటి నుంచి ఆడుకునేందుకు వెళ్లిన బాలుడు తిరిగి రాకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంగీతాదేవి, మోహన్‌సింగ్ దంపతులు 8 నెలలుగా రేణిగుంట మండలం వినాయకపురంలో నివాసం ఉంటున్నారు. మే 25వ తేదీ మధ్యాహ్నం వారి కుమారుడు ఆదిత్య (12) తోటి పిల్లలతో ఆడుకొని వస్తానని వెళ్లాడు. . సాయంత్రానికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. బంధువులు, తెలిసినవారిని విచారించగా వారి దగ్గరికి వెళ్లలేదని తెలియడంతో మంగళవారం గాజుల మండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టెంపో బోల్తా : ఐదుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన టెంపో

ఓజిలి : మండలంలోని రాచపాళెం వద్ద మంగళవారం ఉదయం టెంపో బోల్తా పడడంతో ఐదుగురు గాయపడ్డారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన 14 మంది టెంపోలో అరుణాచలం, రామేశ్వరం, పాండిచ్చేరిలో వివిధ దేవాలయాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో టెంపో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగంది. ప్రశాంతి, సబిత, అంజమ్మ అనే మహిళలతోపాటు, మరో ఇద్దరు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే సిబ్బంది క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఎస్ఐ స్వప్న ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'తోతాపురి' టన్ను రూ.12వేలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్ :తోతాపురి రకం మామిడిని టన్ను రూ.12వేలకు కొనుగోలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలసి మామిడి గుజ్జు ఫ్యాక్టరీ యజమానులతో సమీక్షించారు. రూ.12వేలకు తగ్గించి కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్యాక్టరీ యజమానుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే రైతులకు అండగా నిలవాలని సూచించారు. తిరుపతి ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, చిత్తూరు ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలకు ప్రాధాన్యత

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ద్వారా వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్‌తోపాటు మండల, డివిజన్ స్థాయిలో ప్రజలు అందించే అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై అధికంగా అర్జీలు వస్తున్నాయని వివరించారు. వాటికి పరిష్కారం చూపించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. మరోవైపు పీ-4 కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, డీపీఓ సుశీలాదేవి పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్‌లో చోరీ

నాయుడుపేటటౌన్:పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రెండు కంప్యూటర్ మానిటర్లు, ఇన్‌వెర్టర్‌ను అపహరించారు. ఏఈ రంగస్వామి మంగళవారం ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన పరికరాల విలువ సుమారు రూ.50వేలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో కోవిడ్ కేసు నమోదు

- పది నెలల చిన్నారికి పాజిటివ్

తిరుపతి తుడా : జిల్లాలో కోవిడ్ కలకలం రేగింది. తొలి కేసు మంగళవారం నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పది నెలల చిన్నారికి కరోనా పాజిటివ్ గా నిర్ధారణైంది. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ఎస్టీ కాలనీకి చెందిన చిన్నారికి జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆర్టీపీసీఆర్ పరీక్షలో చిన్నారికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం చిన్నపిల్లల ప్రత్యేక వార్డులో పసిబిడ్డకు చికిత్స అందిస్తున్నారు. కోవిడ్ తీవ్రత సాధారణ స్థితిలోనే ఉందని వైద్యులు తెలిపారు.

మరో యువకుడికి..

మదనపల్లెకు చెందిన 25 ఏళ్ల యువకుడు కేరళలోని తిరువనంతపురంలో ఉద్యోగం చేస్తున్నాడు. గత శుక్రవారం ఆ యువకుడు అనారోగ్యం బారిన పడడంతో తిరువనంతపురంలోని ఆస్పత్రికి వెళ్లగా కోవిడ్ నిర్ధారణ పరీక్ష నిర్వహించారు. పాజిటివ్గా తేలడంతో హోమ్ ఐసోలేషన్లో ఉండాలని వైద్యులు సూచించారు. దీంతో ఆ యువకుడు తన సొంత ఊరు మదనపల్లెకు వచ్చాడు. ఈ క్రమంలో కోవిడ్ పరీక్ష కోసం మంగళవారం రుయాలోని కోవిడ్ కేంద్రానికి తీసుకువచ్చారు. ర్యాపిడ్ పరీక్షల్లో నెగటివ్ రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

చెరువులో పడి రైతు గల్లంతు

పెళ్లకూరు : మండలంలోని దిరసనమాల గ్రామానికి చెందిన దొడ్డగ శ్రీనివాసులు(53) అనే రైతు చెరువులో పడిపోయి మంగళవారం గల్లంతయ్యాడు. వివరాలు.. శ్రీనివాసులు తన భార్య మాధవితో కలిసి చెరువు గట్టు మీదుగా పశువులు ఇంటికి తోలుకెళుతుండగా దూడ నీటిలోకి దిగింది. దూడ కోసం చెరువులోకి దిగిన శ్రీనివాసులు మునిగిపోయాడు. మాధవి కేకలు వేస్తూ ఊరిలోకి పరుగు తీసి గ్రామస్తులకు తెలిపింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

నియంతృత్వంగా పాలన


మాట్లాడుతున్న చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను రద్దు చేయమని, అదనంగా సంక్షేమం అందిస్తామని ఆర్భాటంగా హామీలు గుప్పించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నియంతృత్వంగా పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నగరి నియోజకవర్గ పరిశీలకుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా, ఏడాది పాలన అంటూ జబ్బలు చరుచుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్‌టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు, ఇప్పుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. సంక్షేమ పాలనతో ప్రజల ఆదరణ పొందిన జగనన్నను ఓడించేందుకు కుట్రలు పన్ని, ఈవీఎంల మోసాలతో అధికారంలోకి వచ్చారని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిన ఏడాది గడిచినా వాటిని అమలు చేయకుండా దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ వెన్నుపోటు దినం పేరుతో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేత సారథి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి


మునీంద్ర మృతదేహం

తడ : మండలంలోని బీఎల్‌పాడు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. దొరవారిసత్రం మండలం, ఉచ్చూరు గ్రామానికి చెందిన చిత్తూరు మునీంద్ర(25) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆరంబాకంలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుంగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న తమిళనాడు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మునీంద్రను 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

జాతరలో ఘర్షణ

– యువకుడికి కత్తిపోట్లు


సాయి పొట్టపై కత్తిపోటు

ఏర్పేడు : మండలంలోని వికృతమాల పంచాయతీ తుడా కాలనీలో గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. మరో యువకుడు సైతం గాయపడ్డాడు. వివరాలు.. తుడా కాలనీలో జాతరకు రేణిగుంట మండలం మర్రిగుంట నుంచి కొందరు యువకులు వెళ్లారు. అక్కడ స్థానిక యువకులు కొందరు మద్యం మత్తులో వీరిని దూషిస్తూ దాడికి దిగారు. దీంతో మర్రిగుంటకు చెందిన సాయి(22)ని కత్తితో పొడిచేశారు. మధు అనే యువకుడిని విచక్షణారహితంగా కొట్టారు. సమాచారం అందుకున్న ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి హుటాహుటిన గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. నిందితులు పరారీలో ఉన్నారు.

హోటల్‌లో ఫుడ్ పాయిజన్

– ఇద్దరు యువకులకు అస్వస్థత


హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

రేణిగుంట : పట్టణంలోని ఓ హోటల్‌లో బిరియానీ తిని ఇద్దరు యువకులు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. హోటల్ తనిఖీలు నిర్వహించారు. మాంసాహారం నిల్వ ఉండడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో హోటల్‌ను సీజ్ చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ ప్రభురావు మాట్లాడుతూ బిరియానీ ఫుడ్ పాయిజనింగ్ కావడంతో ఇద్దరు యువకులు ఆస్పత్రి పాలైనట్లు వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హోటల్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. కార్యదర్శి మణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు భరోసా

- చోరీల కట్టడికి ప్రత్యేక నిఘా బృందం
- విష్ణునివాసం, శ్రీనివాసం వద్ద నిరంతర పర్యవేక్షణ
- పటిష్ట చర్యలు చేపట్టిన పోలీసులు


అనుమానితుల వేలిముద్రలను సేకరిస్తున్న పోలీసు సిబ్బంది

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే భక్తులకు భద్రతా పరంగా భరోసా కల్పించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ప్రధానంగా భక్తులు బస చేసే విష్ణునివాసం, శ్రీనివాసం సముదాయాల వద్ద చోరీల కట్టడిపై దృష్టి సారించారు. ఇటీవల భక్తుల సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు అపహరణకు గురవుతున్న నేపథ్యంలో పకడ్బందీగా నిఘా పెట్టారు. విష్ణునివాసం కాంప్లెక్స్‌కు కూత వేటు దూరంలోనే ఈస్ట్ పోలీసుస్టేషన్, రైల్వేస్టేషన్ వద్ద పోలీసు కంట్రోల్ పాయింట్ ఉంది. ఈ ప్రాంతం తరచూ యాత్రికులతో రద్దీగా ఉంటుంది. దీంతో ఒకవైపు వాహనాల రాకపోకలు, మరోవైపు ఆటోలు, ద్విచక్ర వాహన చోదకులు, పాదచారుల తాకిడికి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ క్రమంలో దొంగలను గుర్తించడం పోలీసులకు కష్టతరంగా మారింది. అప్రమత్తంగా ఉన్నప్పటికీ దొంగలు విష్ణునివాసంలోకి వెళ్లి భక్తులతో పాటు కలసిపోయి చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్లను తస్కరించేస్తున్నారు. విష్ణు నివాసంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ హల్‌చల్ చేస్తున్నారు.

స్పందించిన ఎస్పీ

విష్ణునివాసం, శ్రీనివాసం సముదాయాలలో 15 రోజులుగా జరుగుతున్న సెల్‌ఫోన్ల వరుస చోరీలపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పందించారు. సెల్‌ఫోన్లు అపహరించేవారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని డీఎస్పీ భక్తవత్సలానికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే సీఐ శ్రీనివాస్ తన బృందంతో విష్ణునివాసం, శ్రీనివాసం సముదాయాల వద్ద ఫింగర్ ప్రింట్స్ సేకరణ యంత్రం ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సోమవారం సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడిన 15 మందిని గుర్తించి అదుపులోకి తీసుకుని వారి నుంచి 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు చేసిన భక్తులకు సెల్‌ఫోన్లను అందించారు. నిందితులు తమిళనాడు, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

మరో 30 సీసీ కెమెరాల ఏర్పాటు

విష్ణునివాసంతో పాటు శ్రీనివాసం సముదాయాలలో సీసీ కెమెరా పర్యవేక్షణ లేని ప్రదేశాలను గుర్తించి అదనంగా 30 కెమెరాలను అమర్చాలని పోలీసులు నిర్ణయించారు. అపరిచితులు, అప్పటిప్పుడు కొత్తగా పరిచయం చేసుకునే వారితో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు మైకు ద్వారా సూచనలిస్తున్నారు.